క్లుప్తంగా

ఆటోడ్రైవర్‌ను సన్మానించిన డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి



ఆటో డ్రైవర్ కొల్లూరి వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి

కోదాడరూరల్ : రూ.లక్ష నగదు ఉన్న బ్యాగును ఓ వృద్ధురాలు గురువారం ఆటోలో మరిచిపోగా బ్యాగును తిరిగి ఇచ్చి నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్ కొల్లూరి వెంకటేశ్వర్లును శుక్రవారం డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి తన కార్యాలయంలో సన్మానించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ.. నిజాయితీ చాటుకుంటే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అన్నారు. కొల్లూరి వెంకటేశ్వర్లును మిగతా ఆటో డ్రైవర్లు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ



పాఠశాలకు మైక్‌సెట్ అందజేస్తున్న గుజ్జ పిచ్చయ్య, స్వప్న దంపతులు

నడిగూడెం : మండలంలోని రామాపురంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన గుజ్జ స్వప్న, పిచ్చయ్య దంపతులు శుక్రవారం ఆరు వేల రూపాయల విలువైన మైక్ సెట్‌ను బహూకరించారు. ఇదే పాఠశాలలో విద్యనభ్యసించిన గుజ్జ స్వప్న ప్రస్తుతం హైదరాబాద్‌లో ఎస్ఐగా పని చేస్తున్నారు. తాను చదువుకున్న పాఠశాలపై మమకారంతో పాఠశాల అభివృద్ధికి తోడ్పాటునందించినట్లు ఆమె తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కామళ్ల గోపయ్య, ఉపాధ్యాయుడు ఏడుకొండలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మైహోం'కు ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ టెస్టింగ్ సర్టిఫికెట్



ఎన్ఏబీఎల్ సర్టిఫికెట్ అందుకుంటున్న మైహోం సిమెంట్ పరిశ్రమ ప్రతినిధులు

మేళ్లచెరువు : మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమకు ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ టెస్టింగ్ సర్టిఫికెట్ లభించినట్లు యూనిట్ హెడ్ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. భారత ప్రభుత్వంచే గుర్తింపుపొందిన నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ క్యాలిబ్రేషన్ లేబరేటరీ సంస్థ నుంచి సర్టిఫికెట్‌ను శుక్రవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో సీఈఓ వెంకటేశ్వరన్, డిప్యూటీ డైరెక్టర్ రాహుల్ జైన్ చేతుల మీదుగా మైహోం సంస్థ సీనియర్ డిప్యూటీ జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డి అందుకున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన ఎన్ఏబీఎల్ సర్టిఫికెట్ రావడం మైహోంకు చాలా గర్వకారణమన్నారు. కార్యక్రమంలో నేషనల్ అక్రిడిటేషన్ బోర్డు ఫర్ టెస్టింగ్ అండ్ క్యాలిబ్రేషన్ లేబరేటరీ సంస్థ డైరెక్టర్ పంకజ్, జాయింట్ డైరెక్టర్ గాయత్రి, మైహోం సంస్థ ప్రతినిధి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

నడిగూడెం : కులం పేరుతో దూషించి దాడి చేసిన వ్యక్తులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. శుక్రవారం మునగాల సీఐ రామకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నడిగూడెం మండలం చెన్నకేశ్వాపురం గ్రామానికి చెందిన గొబ్బి నరేష్‌ను ఈ నెల 28న అదే గ్రామానికి చెందిన గోసుల సాంబయ్యతో పాటు మరి కొందరు కులం పేరుతో దూషించి దాడి చేశారు. దీంతో నరేష్ గాయాలపాలయ్యాడు. బాధితుడి భార్య గొబ్బి ఉమ ఫిర్యాదు మేరకు సాంబయ్యతో పాటు మరి కొందరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, దాడిని ఖండిస్తూ నడిగూడెం అంబేడ్కర్ విగ్రహం ఎదుట మాల మహానాడు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాల మహానాడు కోదాడ నియోజకవర్గ కన్వీనర్ గుజ్జ ఆంజనేయులు మాట్లాడుతూ.. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అనాథ ఆశ్రమంలో దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న దాతలు

హుజూర్‌నగర్ : గరిడేపల్లి మండలం పొనుగోడుకు చెందిన ఏడిపాల కనకారెడ్డి, శ్రీదేవి కుమారుడు శివారెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని జీప్సీ అనాథ ఆశ్రమంలో చిన్నారులకు రూ.12 వేల విలువ గల దుప్పట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సామాజిక కార్యకర్త ఆకుల రాము, భూపతిరెడ్డి, వెంకట్రావమ్మ, శ్రీవాణి, ఆశ్రమ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ రోడ్లు అస్తవ్యస్తం



మునగాల వద్ద సర్వీస్ రోడ్డుపై ఏర్పడిన ఇసుక మేట



కంపచెట్లు, చెత్తచెదారంతో నిండిన డ్రెయినేజీ

- సర్వీస్‌రోడ్లపై ఇసుక మేటలు
- చెత్తాచెదారంతో పూడిపోయిన మురుగు కాలువలు
- వెలగని విద్యుత్ దీపాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మునగాల : మండల కేంద్రంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. సర్వీస్ రోడ్లకు ఇరుపక్కలా పలుచోట్ల డ్రెయినేజీ పూడిపోవడంతో వర్షాకాలంలో వరద నీరు రోడ్లపై పారుతోంది. రోడ్లపై ఇసుక మేటలు వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ఏర్పాటు చేసిన వీయూపీ బ్రిడ్జికి ఇరువైపులా సుమారు రెండు కి.మీ. మేర జీఎమ్మార్ సంస్థ సర్వీస్ రోడ్లు, మురుగుకాలువలు నిర్మించింది. అంతేకాకుండా సర్వీస్ రోడ్లపై విద్యుత్ దీపాలను ఏర్పాటు చేసింది. కానీ డ్రెయినేజీ పూడిపోవడంతో సర్వీస్ రోడ్లపై వచ్చే వరద రోడ్లపై పారుతూ రోడ్లపై మూడు అంగుళాల మేర ఇసుకమేటలు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, ఆటోలు అదుపుతప్పి ప్రమాదాలు జరుగుతున్నాయి. పలు చోట్ల సర్వీస్ రోడ్ల వెంట ఏర్పాటు చేసిన డ్రెయినేజీలపై మూతలు లేకపోవడంతో చెత్త చెదారం చేరింది. దీంతో మురుగునీరు ప్రవహించకుండా పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమల ఉధృతి ఎక్కువైంది. దీంతో డ్రెయినేజీ పక్కన నివాసముండే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. సర్వీస్ రోడ్లపై పలు వీధి దీపాలు గత నెలరోజులుగా వెలగడం లేదు. బ్రిడ్జి కింద ఉన్న నాలుగు విద్యుత్‌దీపాలు వెలగకపోవడంతో ప్రజలు రాత్రివేళ ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నేషనల్ హైవే అథారిటీ సిబ్బంది స్పందించి సర్వీస్ రోడ్లపై ఇసుకమేటలను, డ్రెయినేజీలలో చెత్తచెదారం తొలగించి, వెలగని విద్యుత్‌దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

సర్వీస్ రోడ్లపై ఇసుక మేటలతో ప్రమాదాలు



మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్లపై ఇసుక మేటలతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇసుక మేటలను తొలగించాలని పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు విన్నవించినప్పటికీ ఫలితం లేదు. ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

– ఇటికాల జ్ఞానసుందర్, మునగాల

డ్రెయినేజీ దుర్వాసన వెదజల్లుతోంది



మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్ల వెంట ఏర్పాటు చేసిన డ్రెయినేజీని ఏళ్ల తరబడి శుభ్రం చేయకపోవడంతో చెత్తచెదారంతో నిండిపోయి దుర్వాసన వెలువడుతుంది. కొన్నిచోట్ల పిచ్చి, కంపచెట్లతో నిండిపోయి, డ్రెయినేజీ రూపురేఖలే లేకుండా పోయాయి. ప్రతి ఆరునెలలకు ఒకసారి డ్రెయినేజీని శుభ్రం చేయాలి.

– చిల్లంచర్ల ప్రభాకర్, సీపీఐ నాయకుడు, మునగాల

విద్యుత్ దీపాలు వెలగడం లేదు

మండల కేంద్రంలోని సర్వీస్ రోడ్లపై పలు ప్రాంతాలలో విద్యుత్ దీపాలు వెలగడం లేదు. ముఖ్యంగా బ్రిడ్జి కింద నాలుగు లైట్లు కూడా వెలగడం లేదు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. లైట్లు వెలగకపోవడంతో రాత్రిళ్లు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– కోదాటి కవిత, కూరగాయల వ్యాపారి, మునగాల

పెన్షనర్ల సామూహిక జన్మదిన వేడుకలు



హుజూర్‌నగర్ : జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న పెన్షనర్లను సన్మానిస్తున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య, తదితరులు

హుజూర్‌నగర్ : పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి పెన్షనర్ల సంఘం నిర్విరామంగా కృషి చేస్తోందని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెళ్ల సీతారామయ్య అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లోని ప్రభుత్వ పెన్షనర్ల కార్యాలయంలో పెన్షనర్ల సామూహిక జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సమస్యలలో కొన్ని వచ్చే నెలలో పరిష్కారానికి నోచుకునే అవకాశం ఉందని చెప్పారు. పెన్షనర్ల సంఘం, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వం మధ్య పెరిగిన దూరాన్ని సీఎం గమనంలోకి తీసుకొని వచ్చే నెల రెండున ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపేందుకు ముందుకు వచ్చారని తెలిపారు. సెప్టెంబర్‌లో హెల్త్ కార్డుల సమస్యలు పరిష్కారమయ్యే అవకాశం ఉందని అన్నారు. అనంతరం నియోజకవర్గంలో వృద్ధుల సమస్యలను పరిష్కరించి ప్రశంసలు అందుకున్న సీనియర్ సిటిజన్‌ల సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి ధర్మూరి వెంకటేశ్వర్లుకు మెమెంటో అందజేసి సత్కరించారు. ఈ నెలలో జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న పెన్షనర్లను సన్మానించారు. సమావేశంలో మండల సంఘం అధ్యక్షుడు చెన్న సోమయ్య, నాయకులు బొల్లు రాంబాబు, అంకతి అప్పయ్య, కొప్పుల వీరారెడ్డి, దేవన్న, ఎంఎస్ఎన్ రాజు, పారుపల్లి చంద్రశేఖర్, కేవీఎస్ మూర్తి, ధర్మూరి వెంకటేశ్వర్లు, ముక్కా మధు, తాటి ప్రభాకర్‌రెడ్డి, విజయ మేరీ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్లలో..

నేరేడుచర్ల : పట్టణంలోని రిటైర్డు ఉద్యోగుల భవనంలో శుక్రవారం పలువురి పెన్షనర్ల సామూహిక జన్మదిన వేడుకలను రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ నెలలో జన్మదిన వేడుకలు జరుపుకుంటున్న మౌలానా, రామస్వామి, కమలమ్మ, లక్ష్మీకాంతం, శ్రీరాంరెడ్డి, వేరోనికమ్మ, లక్ష్మమ్మ, కళావతి, పురుషోత్తమరావు, విమల, రంగారెడ్డిని శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్లు సత్యనారాయణ, బుద్దారెడ్డి, సుందరయ్య, రంగారెడ్డి, వీరభద్రరావు, లక్ష్మారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.



నేరేడుచర్ల : వేడుకల్లో పాల్గొన్న పెన్షనర్లు

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



చిలుకూరు : ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు, విద్యార్థులు

చిలుకూరు : హాకీ క్రీడాకారుడు, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని చిలుకూరు మండల కేంద్రంతో పాటు మండలంలోని బేతవోలు, నారాయణపురం, రామాపురం గ్రామాల్లో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్ చిత్రపటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా చిలు కూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో తెలుగు భాషా వ్యవహారిక ఉద్యమకారుడు గిడుగు వెంకట రామమూర్తి పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ గురవయ్య, ప్రధానోపాధ్యాయులు కరుణాకర్‌రెడ్డి, గుజ్జుల నరసింహారెడ్డి, శివకుమారి, ఉపాధ్యాయులు విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో..

హుజూర్‌నగర్ : పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా హాకీ మాంత్రికుడు ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో పాఠశాలల హెచ్‌ఎంలు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అవకతవకలపై విచారణ జరపాలని వినతి

నేరేడుచర్ల : మున్సిపాలిటీ పరిధిలోని బక్కయ్యగూడెంలో ఓటరు జాబితాలో జరిగిన అవకతవకలపై విచారణ జరపాలని కోరుతూ స్థానికులు శుక్రవారం నేరేడుచర్ల తహసీల్దార్ సురగి సైదులు, ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. బీఎల్ఓ.. ఓటర్ల జాబితాలో గ్రామానికి సంబంధం లేని ఓటర్లను చేర్పించారని, గత 10 ఏళ్ల క్రితం బక్కయ్యగూడెం నుంచి వెళ్లిపోయిన వారిని, వారి బంధువులను తిరిగి ఓటరు జాబితాలో చేర్పించారని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో బక్కయ్యగూడెం చెందిన కరణం నరసయ్య, లక్ష్మయ్య, నాగరాజు, సంపత్, నరేష్, వెంకటేశ్వర్లు, లింగయ్య, వీరభద్రరావు తదితరులు ఉన్నారు.

తెలుగు భాషను మరవొద్దు



గిడుగు రామ్మూర్తి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

కోదాడ : తెలుగు భాష.. అమ్మ భాష అని దానిని ఎప్పుడు మరవొద్దని నకిరేకల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బెల్లి యాదయ్య అన్నారు. శుక్రవారం కోదాడలోని కేఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన తెలుగు భాషా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా పట్టణంలోని ఎంఎస్ జూనియర్ కళాశాల, తేజ టాలెంట్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమాల్లో డాక్టర్ చందా అప్పారావు, పందిరి నాగిరెడ్డి, ఎస్ఎస్.రావు, జానకిరామయ్య, సంతోష్‌కుమార్, సోమానాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

పాలకవీడు : విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తహసీల్దార్ కమలాకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం ఎంఈఓ కాటయ్య మాట్లాడుతూ.. ఈ క్రీడల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన 14- 17 సంవత్సరాలలోపు బాలబాలికలు పాల్గొనవచ్చని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేయడంతో పాటు ప్రోత్సాహకాలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ లక్ష్మి, ఎంఏఓ కళ్యాణచక్రవర్తి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.సుభాషిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

నేరేడుచర్ల : క్రీడలతో మానసిక ఉల్లాసం లభించడంతో పాటు స్నేహభావం పెంపొందుతుందని ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ యడవల్లి అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నేరేడుచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడలను ఎంఈఓ పొల్లూరి సత్యనారాయణరెడ్డితో కలిసి ప్రారంభించి మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు బట్టు మధు, ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఎఫ్ ప్రతినిధులు యాదగిరి, ఏసుపాదం, అశోక్, శ్రీనివాస్, భాస్కర్, ప్రియదర్శిని, అరుణ, ఆదినారాయణ, ఉపాధ్యాయులు రషీద్, జానకిరాములు, నాగమణి, నర్సింహారావు, రామ్మూర్తి, జనార్దన్ తదితరులు ఉన్నారు.



నేరేడుచర్లలో మండల స్థాయి క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపీడీఓ సోమ సుందర్‌రెడ్డి

నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ తప్పదు

- ఎస్పీ నరసింహా

కోదాడరూరల్ : అలవాటుగా నేరాలకు పాల్పడే వ్యక్తులపై పీడీ యాక్ట్ నమోదు చేయడం తప్పదని జిల్లా ఎస్పీ నరసింహా హెచ్చరించారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్‌లో సబ్ డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్‌లు, పాతనేరస్తులు, టేబుల్ మాంగర్స్‌తో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత నేరస్తులు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, ఇతరులను ఇబ్బంది పెట్టకుండా సత్ప్రవర్తన కలిగి ఉంటే భవిష్యత్‌లో రౌడీషీట్స్ ఎత్తివేస్తామన్నారు. నేరచరిత్ర కలిగిన వారిపై నిరంతర నిఘా ఉంటుందన్నారు. గంజాయి వాటి మాదకద్రవ్యాలు అమ్మడం, తాగడం వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గణేష్ నిమజ్జనాల స్థలాల్లో తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. ఇకనుంచి సత్ప్రవర్తన కలిగి ఉంటామని పాత నేరస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. అంతకు ముందు రూరల్, షీ టీమ్ పోలీస్ స్టేషన్‌లను ఎస్పీ తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కోదాడ డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, సీఐలు శివశంకర్, చరమందరాజు, రామకృష్ణారెడ్డి, ప్రతాప్‌లింగం, డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహా

ఆరోగ్య ప్రదాత మంత్రి ఉత్తమ్



మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : నియోజకవర్గ ప్రజల ఆరోగ్య ప్రదాత మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అని ఉత్తమ్ సార్ సోషల్ మీడియా కమిటీ మెంబర్ దగ్గుపాటి బాబురావు అన్నారు. స్థానిక ఏరియా హాస్పిటల్‌లో అదనపు సౌకర్యాలు కల్పించిన మంత్రి ఉత్తమ్, ఎమ్మెల్యే పద్మావతి చిత్రపటాలకు శుక్రవారం బాబూరావు ఆధ్వర్యంలో హాస్పిటల్ వద్ద పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్పత్రిలో డయాలసిస్ సెంటర్, రక్త నిధి కేంద్రం, సిటీ స్కాన్ మిషన్‌లను ఇటీవల మంత్రి ప్రారంభించారని తెలిపారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు రెడపంగు రాము, నాయకులు కొల్లపూడి దయాకర్, కస్తాల రవి, నరసింహారావు, ప్రవీణ్, కళ్యాణ్, కిషోర్, రంజిత్, అరుణ్, నారాయణ, జోజి, దేవమణి తదితరులు పాల్గొన్నారు.

ఆటో దగ్ధం.. పోలీసులకు ఫిర్యాదు

మోతె : ఇంటి ముందు నిలిపి ఉంచిన ఆటో దగ్ధమైంది. ఈ ఘటన మోతె మండలంలోని నాగయ్యగూడెంలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్ఐ అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చావల పుల్లయ్య ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి ఆటోను తన ఇంటి ముందు నిలిపి ఉంచాడు. శుక్రవారం తెల్లవారుజామున ఆటో కాలిపోతుండడాన్ని పుల్లయ్యతో పాటు తన ఇంట్లో నిద్రిస్తున్న దిండు ఉప్పయ్య గమనించి తెలపడంతో ఆయన వెంటనే నీటితో మంటలను ఆర్పాడు. కానీ అప్పటికే ఆటో కాలిపోయింది. ఆటోను దగ్ధం చేసిన దుండగులను గుర్తించి చర్యలు తీసుకోవాలని పుల్లయ్య శుక్రవారం మోతె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రేపు మంద కృష్ణమాదిగ రాక

కోదాడరూరల్ : చేయూత పింఛన్లను పెంచుతామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఈ నెల 31 కోదాడలో నిర్వహించబోయే వికలాంగులు, చేనేత పెన్షన్‌దారుల సన్నాహక సభకు మంద కృష్ణ మాదిగ హాజరవుతున్నారని, ఈ మహాసభను విజయవంతం చేయాలని చేయూత పింఛన్ దారుల జిల్లా ఇన్‌చార్జ్ ఏపూరి రాజు మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని 34, 35 వార్డుల్లో పింఛన్‌దారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఎస్పీ నాయకులు కొండపల్లి ఆంజనేయులు, కర్ల విజయరావు, జయమ్మ, నాగజ్యోతి, ఈశ్వరమ్మ, సైదమ్మ, మారతమ్మ, నాగేంద్ర, లక్ష్మి, పిచ్చమ్మ, యశోద, నాగమ్మ ఉన్నారు.

సన్నాహక సభను విజయవంతం చేయాలి

చిలుకూరు : కోదాడలోని ఆర్ఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 31న నిర్వహించబోయే వికలాంగులు, చేనేత పెన్షన్‌దారుల సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు వడ్డేపల్లి కోటేష్ కోరారు. శుక్రవారం కొండాపురంలో జరిగిన వికలాంగులు, చేనేత పెన్షన్‌దారుల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లెపంగు సూరిబాబు, జిల్లా నాయకులు మెరిగ రామారావు, వీరబాబు, ప్రమీళ, చుక్కమ్మ పాల్గొన్నారు.

నడిగూడెం : వికలాంగులు, చేయూత పింఛన్‌దారులు సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి బచ్చలకూరి వెంకటేశ్వర్లు మాదిగ కోరారు. శుక్రవారం రత్నవరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ, మిట్టగణుపుల మోష, మొలుగూరి సైదులు, లంజపల్లి శ్రీను, వెంకన్న, సాల్మన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్ పెంపు హామీ అమలు చేయాలి

మోతె : పెన్షన్ పెంపు హామీని అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జి కుటుంబరావు కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కోదాడలో జరగబోయే సభను జయప్రదం చేయాలన్నారు. బైరపంగు విజయకుమార్, గురిజాల వెంకన్న, ప్రభాకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీటీ రోడ్డు వేయాలని ఆందోళన



కృష్ణాతండా వద్ద రోడ్డుపై బురదలో నిలబడి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మఠంపల్లి : మండలంలోని కృష్ణాతండా నుంచి సుల్తాన్‌పూర్‌తండాకు వెళ్లే 2 కిలోమీటర్ల దూరం గల డొంకరోడ్డు బురదమయమై ప్రజలు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం వెంటనే బీటీ రోడ్డు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగారపు పాండు డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఎం మండల నాయకులతో కలిసి బురదమయంగా మారిన రోడ్డును ఆయన పరిశీలించారు. బురదలో నిలబడి నిరసన తెలిపి మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పాండునాయక్, మండల కార్యదర్శి బాలునాయక్, నాయకులు శంభయ్య, వీరబ్రహ్మాచారి, రైతులు కేశ్యా, చిన్నోడు, భూన్యా, హుస్సేన్, మట్టపల్లి, నరసింహ పాల్గొన్నారు.

నేడు అఖిలపక్ష సమావేశం

పాలకవీడు : ఓటరు ముసాయిదా జాబితాపై మండల పరిషత్ కార్యాలయంలో శనివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పార్టీల నాయకులు పాల్గొని ఓటరు జాబితాపై అభిప్రాయాలను, సూచనలను తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

వినాయక మండపాల వద్ద కుంకుమ పూజ



హుజూర్‌నగర్ : వినాయకుని వద్ద కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

హుజూర్‌నగర్ : పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా గణేష్ నవరాత్రి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకుంటున్నారు. శుక్రవారం పట్టణంలోని వినాయక మండపాల వద్ద మహిళలు భక్తిశ్రద్ధలతో గౌరీ, కుంకుమ పూజలు చేశారు. ఏకదంతుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆయా మండపాల నిర్వాహకులు, కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

కోదాడరూరల్ : కోదాడ మండలం, పట్టణంలో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. పట్టణ పరిధిలోని గోపిరెడ్డినగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శుక్రవారం మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు రెడ్డిమళ్ల వెంకట్‌రెడ్డి, రావెళ్ల కృష్ణారావు, మాలతి, బాడిష రామారావు, ఎర్రసాని మహేష్‌రెడ్డి, పెద్దిరెడ్డి రవీందర్‌రెడ్డి, అంబురి వెంకట్‌రెడ్డి, వాచేపల్లి వెంకటేశ్వరరెడ్డి, గడ్డం వెంకట్‌రెడ్డి, గాయం బ్రహ్మానందరెడ్డి, పింగలి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా మండలంలోని గ్రామాల్లో ప్రతిష్ఠించిన వినాయకులకు శుక్రవారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

నడిగూడెం : మండలంలోని రామాపురం గ్రామంలో వారణాసి అంజయ్యకు చెందిన పూరిల్లు ఈ నెల 28న విద్యుదాఘాతంతో దగ్ధమైంది. ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 వేల ఆర్థికసాయంతో పాటు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను శుక్రవారం తహసీల్దార్ బూసిరెడ్డి రామకృష్ణారెడ్డి బాధితుడు అంజయ్యకు అందజేశారు. ఆర్ఐ రాంబాబు, డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు వరికల రమేష్, ఉపేందర్, వాసు, కిరణ్, ధనయ్య, సామేలు పాల్గొన్నారు.

సైబర్ మోసాల బారిన పడొద్దు

చిలుకూరు : విద్యార్థులు సైబర్ మోసాల బారిన పడొద్దని షీటీం హెడ్ కానిస్టేబుల్ కవిత అన్నారు. శుక్రవారం మండలంలోని గేట్ ఇంజనీరింగ్ కళాశాలలో పోలీస్ కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గేట్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామారావు, డాక్టర్ రవీందర్, కోదాడ మహిళా షీటీం కానిస్టేబుల్ సాయిజ్యోతి, కానిస్టేబుల్ నరేంద్రవర్మ, పోలీస్ కళాజాత ఇన్‌చార్జ్ యల్లయ్య, సభ్యులు గోపయ్య, చారి, నాగార్జున్, కృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముసాయిదా జాబితాపై నేడు సమావేశం

చిలుకూరు : పోలింగ్ కేంద్రాల ముసాయిదా జాబితాపై శనివారం మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి రాజకీయ నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ గిరిబాబు శుక్రవారం తెలిపారు. పార్టీల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరు కావాలన్నారు.

బీసీల యుద్ధభేరిని జయప్రదం చేయాలి

మునగాల : స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 31న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించబోయే బీసీల యుద్ధభేరి సభను జయప్రదం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పోనుగోటి రంగా డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోలోజు మహేష్‌చారి, గడ్డం లక్ష్మీనారాయణ, నాయకులు వీరయ్య, మహేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

చెత్త తొలగించి.. రాకపోకలు పునరుద్ధరించి



బేతవోలు చెరువు వద్ద కల్వర్టుకు అడ్డుపడిన చెత్తను తొలగిస్తున్న పంచాయితీ సిబ్బంది

చిలుకూరు : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చిలుకూరు మండలంలోని బేతవోలు చెరువు తూముల నుంచి నీరు ఉధృతంగా బేతవోలు రోడ్డుపైకి వస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దీంతో కల్వర్టుకు అడ్డుపడిన చెత్తాచెదారాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ శుక్రవారం పంచాయతీ సిబ్బందితో తొలగింపజేసి చెరువు తూముల నుంచి వచ్చే నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టి రాకపోకలు పునరుద్ధరించారు.